# 4. ప్రతిఫలం

ఆకాశం చిల్లి పడ్డట్టు కుంభవర్షం కుమ్మరిస్తోంది. 'ఈ సాయంత్రం కూడా నా ప్రయాణానికి ఆటంకమే కలిగిం'దనుకున్నాను. మా పెద్దక్కయ్య గారింటికి చుట్టపుచూపుగా వచ్చిన ఐదోరోజది.

ఆ ప్రకృతి నాలో వివిధ భావాల్ని రేకెత్తించింది. ఒక విధమైన 'ఇమోషన్'తో కథ రాద్దామని కూర్చున్నాను. ఏవేవో వివిధ భావాలైతే బుర్రలో ఉన్నాయి కాని - రచనలోకి మాత్రం దిగటంలేదు. కలాన్ని పెదిమలసందున నొక్కి ఇంటివాసాల్ని లెక్కిస్తూన్నట్టు - పై చూపుతో ఆలోచిస్తుండగా, మణి అంతా ముంచుకుపోతున్నట్టు గబగబా పరుగెత్తుకువచ్చి "మామా! ఏంటి - రాస్తున్నావ్?" అంది.

మణి ఎనిమిదేళ్ళ పిల్ల : మహా గడుసుది. ఈ ఐదు రోజుల్లోనూ నా దగ్గర బాగా చనువును సంపాదించగలిగింది.

"ఏదో కథ రాస్తున్నా -"

"అయితే మామా! నాకో కథ చెప్పవూ?"

నాకు కథలు రాయటమే కాని, చెప్పే అలవాటూ, చెప్పటంలో నిపుణత్వమూ లేదు. ఈ అలవాటులేని అవపోసన సంగతి మణికి ఎల్లా చెప్పేది? ఎల్లాగైనా తప్పిద్దామని "పోయి ఆడుకోరాదూ?" అన్నా.

"వానలో తడుస్తే జలుబు చేస్తుంది - ఎక్కడికీ వెళ్లొద్దని అమ్మ చెప్పింది -" ఈ వాన నాకూ మణికీ కూడా అపకారాన్నే చేసిందన్నమాట!

"పోనీ చదువుకో" -

"మాస్టారు మాత్రం వానలో తడుస్తూ వస్తారాయేం?" వాన కురుస్తూన్నంత మాత్రాన యీలోకంలో అందరి పనులూ ఆగిపోతాయనుకొనే పిచ్చిపిల్ల!

"ఇంకో గంటసేపు వాన కురుస్తే - మాస్టరు రాడు...." మణి స్వగతంలో అనుకుంటోంది.

"ఏం - మాస్టారు మంచివాడు కాదూ?"

నాకు తెలుసు నా కథారచన ఆగిపోయిందని; మణి నన్ను కథారచన కన్న ఎక్కువ శక్తితో ఆకర్షించిందన్న మాట!

"వెధవ మాస్టారు!" అని కళ్ళు ముప్పాతిక భాగానికి మూసి, ముక్కు వెడల్పుచేసి, కనుబొమ్మలు చిట్లించి - మొత్తంమీద నేను జీవితంలో ఎప్పుడూ చూడని ముఖ భంగిమపెట్టి, "ఇట్లా మొఖంవేసుకొని ....ఛీ! - కోతిలాగు వస్తాడు. పాఠం చదవకపోతే - వీపుమీద చరుస్తాడు - ఏవేవో చెప్తాడు - వాడి బొంద!" మణి మాటలకు నాకు నవ్వొచ్చింది.

"నేను మాస్టర్నయి, వాడు నేనైతేనా - వాడి వీపు చిట్ల కొట్టనూ?" మణి కోపంగా చూస్తోంది. నిజంగా మాష్టరు అక్కడవుంటే ఎవరి వీపు చిట్లేదో - మరి?

"పోనీ - నేను పాఠం చెప్తా రా-"

"నువ్వా? మామా! నువ్వు మంచివాడివనుకున్నాను. నువ్వుకూడా మాస్టరులాగు తయారౌతా వనుకోలేదు. రోజూ దేవుడు ఇల్లా సాయంత్రంపూట ఒక గంటసేపు వాన కురిపిస్తూవుంటే-" మణి భుజాలు ఎగరవేసింది. ఇల్లా వాన కురిపించేకన్న తేలికమార్గం - అంటే మాస్టారి మృత్యువు లాటిది - మణి బుల్లి బుర్రకు తట్టలేదనుకుంటా. ఇంకెల్లాగు కథ సాగదని కలం ముడిచేశాను.

"మామా! అయితే కథ చెప్పవూ?" అని మణి నా చేతుల్ని ఊపుతూ అడిగింది.

ఇంక చెప్పకపోతే వదలదు - ఇది తప్పేది కాదన్నట్టు - మణికీ, మణిలాటి చిన్నపిల్లలకూ ఏ రకం కథలు చెప్పాలోనని - నా జీవితంలో మొట్ట మొదటిసారి ఆలోచించసాగాను. రామాయణ భారతాల్లోవి గ్రంథ చౌర్యం అవుతయ్యని స్వకపోలకల్పితాన్ని వెదికాను. మానాన్న రోజూ ఎదురింటి అరుగుమీద సభచేసి ఆ వీధిలోవున్న పిల్లలందరికీ, కథలు నూరిపోస్తూ వుంటాడు. ఆ రకం కథల్లో ఒకదాన్ని 'శాంపిల్' కింద జారీచేద్దామనుకొని నిశ్చయించుకొన్నా. కాని సమయానికి వొక్కటీ జ్ఞాపకం రాదే! 'అసలు మొదలెడుతే అదే సాగుతుందిలే' అనుకొని గొంతు సవరించుకొన్నా. మణి మహా మంచిపిల్లలాగు నిశ్శబ్దంగా కూర్చుంది. "అనగా ...అనగా...ఒక వూళ్ళో ఒక రాజుండేవాడు..."

"ఏ రాజు?"

నా తలకాయరాజు! ఏ రాజని చెప్పేది? పూర్వం చదువుకున్న దేశ చరిత్ర జ్ఞాపకానికి వొచ్చి, తడువుకోకుండా "అశోకుడనే రాజు" అన్నాను.

"ఏ వూళ్ళో?"

"బొంబాయిలో–" నాకు జాగ్రఫీ రాదని మణికి తెలిసినా ఫర్వాలేదు.

"బలే–మామా! బొంబాయిలో అశోకుడనే రాజా! ....బలే!...." మణి నవ్వుతోంది.

నా బండారం బైట పడ్డదనుకొని. "కాదు...మరిచి పొయ్యా...సిమ్లాలో..." అన్నాను.

ఆమె తృప్తిపడ్డట్టు చూస్తూ, "సరే చెప్పు" అంది. మణికి సిమ్లాను గూర్చి తెలియకపోవటం నా అదృష్టమే! కథకు లైన్‌క్లియర్ అయినా – ముందు చెప్పాల్సిన కథను గూర్చి ఆలోచిస్తున్నా.

"చెప్పు మామా!"

"ఆc...ఆc....ఆ రాజునకు ఒక మంచి కోట వుండేది."

"ఏమిటి? కోటా?"

"కోటుకాదు...కోట..అంటే...ఇల్లన్నమాట...పెద్ద – ఇల్లు...." మణి అర్థమైనట్టు తలవూపింది "రాజు గారి భార్యకు..."

"రాజుగారికి ఎంతమంది భార్యలు?"

సామాన్యంగా యీ రకం కథల్లోని రాజులకు ఒకతె కన్న ఎక్కువమంది భార్యలుండటం మామూలని – మణికి కూడా తెలుసేమో? అయినా నా 'రాజు'కు నేను ఒకతె కన్న ఎక్కువమందిని భార్యలను ఇచ్చి వనితాలోకానికి అన్యాయం చేయదల్చుకోలేదు.

"ఒక్కతే భార్య ....విను....ఆ భార్యకు....అంటే....రాజుగారికి....ఒక చక్కని అమ్మాయి వుండేది...ఆమె చక్కగా మాస్టారి దగ్గర చదువుకొని..."

"ఏమిటీ? ప్రైవేటు మాస్టరు దగ్గరే! మామా! అల్లా ఎవ్వరూ చదువుకోరు–" మణి ఆశ్చర్యపడ్డట్టు చూసింది. ఎవరేమన్నా నా కథానాయకిని మాస్టారి దగ్గర చదివించక మానుతానా?

"అందరూ నీలాగే వుంటారటే? ఆ అమ్మాయి మంచిది...అల్లరి చెయ్యకుండా చదువుకొంది..." మణి మాత్రం నమ్మినట్టుగా లేదు. బి.ఎ.లో చదివిన సైకాలజీ నాబుర్రలోంచి వుడాయించటంచేత, ఇల్లాటి అసందర్భపు కథ తయారౌతోందేమో ననుకున్నా. కానీ ఏమైతే అదే అవుతుందని కథ సాగించా.

"విను...ఆ అమ్మాయి...చదువుకొని ....మంచి పాండిత్యం సంపాయించింది–"

"ఆ అమ్మాయి పేరేమిటి?"

నా నెత్తి! మా నాన్న చెప్తూన్నప్పుడు ఏ కుర్రకుంకా ఇల్లాటి ప్రశ్నలు వేయదు; నా ఖర్మం కాలుతే నాకు అన్నీ ఇల్లాటి ప్రశ్నలే! నా చిన్నతనంలో మా తాత కథలు చెప్తూవుంటే ఇల్లాటి ప్రశ్నలే తోచేవికావు! అయినా యీ కాలం పిల్లలకు - శాస్త్రజ్ఞానం ఎక్కువైంది!

ఏం పేరు చెప్పను? నా కథానాయకి తల్లిదండ్రులు నిజంగా - ఆమెకు - పేరుపెట్టడం మరిచిపోయివున్నా - ఇప్పుడు ఆ శ్రమ నాకు తప్పనేలేదు! ఏవో కొన్ని పేర్లను ఆలోచించి, "శ్యామల...." అన్నాను. నా కథ చాలా అవకతవకగా నడుస్తూన్నట్టు నాకు తెలిసినా మణికి కథను చెప్పగలుగుతే చాలుననే పట్టుదలతో వున్నా.

"శ్యామల కొన్నాళ్ళకు పెరిగి... పెద్దదై... యవ్వన వంతురాలైంది... అంటే ఆమెకు పెండ్లియీడు వచ్చిందన్న మాట.... రాజూ రాణి..." ఇందాక మరిచిపోయినా, ఇప్పుడు మణి అడక్కముందే ఆ రాణీగారి పేరును ఆలోచించి, "ఆ రాణీగారైన ...విమలమ్మగారు ... రాజుగారైన అశోకుడి గారితో ..... ఏం చెప్పారంటే .... 'ఏమండీ! అమ్మాయికి వివాహపు వయస్సు వచ్చింది. త్వరగా సంబంధం చూసి పెళ్ళి చెయ్యండీ...' పురాణం చెప్పే ఫక్కీలో రాగాలు తియ్యటం ప్రారంభించాను.

"మామా! అదేంటి అల్లా ఏడుస్తూ రాగాలు తీస్తావు? మా మాస్టారు సుమతీ శతకంలో పద్యాన్ని ఇల్లాగే చదువుతారు మామా!"

నేనేమన్నా గ్రామఫోనుని అనుకుందాయేం? నా అనుభవాన్నంతా ఇమిడ్చి - చిన్నపిల్లలకు చెప్పాల్సిన విధంగా కథ చెప్తూంటే - ఏడుస్తున్నావా అని అడుగుతుంది! మణిలాటి విమర్శకుడు కానీ, విమర్శకురాలు కానీ నాకు ఎప్పుడూ ఎదురవలేదు. అల్లా యెదురుపడితేమాత్రం ప్రతి విమర్శకు కానీ, కనీసం - సమాధానానికి కాని గిజగిజా కొట్టుకోవాల్సిందేనని - గ్యారంటీగా చెప్పగలను!

"మణీ! ఇల్లా మాట మాటకూ అడ్డొస్తే నేను చెప్పను సుమా! నువ్వు కథలు చెప్పేప్పుడు - ఇల్లాటి ప్రశ్నలు రాకుండా చూచుకుందువుకానిలే..." కొంచెం కోపంతో యీ మాటల్ని అనివుంటా.

నా మాటలకు మణి చిన్నబుచ్చుకొని, "అడగనులే మామా! అనుమానం వున్న చోట అడగొద్దూ?" అంది.

మణి ఏడుపుముఖం చూచేప్పటికి నాకు జాలివేసింది. ఇల్లాగే ఇంకా రెండుసార్లు కసురుతే - నిజంగా ఏడుపులో దిగుతుందని ఆమె ప్రశ్నలు నన్ను యెంత విసిగించినా, విధి లేక లేని ఓర్పును తెచ్చిపెట్టుకొని అన్నాను, "సరే, అనుమానం వచ్చిన చోట అడుగు...ఇంక విను...ఎంతవరకూ చెప్పాను...చెప్మా...." వెధవజ్ఞాపకశక్తి రోజు రోజుకూ క్షీణిస్తోంది.

మణి అందుకొని, "రాణీగారు రాజుగారితో అమ్మాయికి పెళ్ళి చెయ్యమని చెప్పారూ..." నాలాగే దీర్ఘం తీసింది.

"ఆఁ....విను.....అప్పుడు రాజుగారు ఏమన్నారంటే– 'అమ్మాయికి ఇష్టమైనవాణ్ని చూసి, త్వరలోనే వివాహం చేస్తాను'.....ఆ మర్నాడు రాజుగారి కూతురైన....విమలమ్మ గారు..."

"విమలకాదు–శ్యామల–"

వెధవపేర్లలో కూడా పొరపాటు పడుతూన్నందుకూ – ప్రత్యేకం మణిలాటి ఎనిమిదేళ్ళపిల్ల నా కథల్లోని తప్పుల్ని ఎత్తి చూపుతూన్నప్పుడూ – నాకు బి.ఎ. డిగ్రీ పరీక్ష పోయినప్పటికన్న ఎక్కువ అవమానాన్ని అనుభవిస్తూన్నట్టు తోచింది. కాని ఏం చేస్తాం?

"అదే...ఆ శ్యామల...ఉద్యానవనంలోకి చెలికత్తెల్తో ఆటలాడుకునేందుకు వెళ్ళింది..."

"మామా! శ్యామల పెద్దదైందన్నావు కదా! పెద్ద వాళ్ళుకూడా ఆడుకుంటారా?"

"ఎందుకు ఆడుకోరు!"

"అయితే అమ్మ ఎప్పుడూ ఆడుకోదేం?"

చచ్చాం – ఈ ప్రశ్నకు ఎక్కడ సమాధానం చెప్పను? నా అల్ప ప్రాణానికి యీ విమర్శకురా లెక్కడ దాపరించింది? ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ముందుకు సాగుతే ఆత్మగౌరవానికీ నష్టం, నాకూ ఆమెకూ కూడా అసంతృప్తి.

"అది కాదే మొద్దూ! రాజుల ఇళ్ళల్లో ఆడుకుంటారు."

"అయితే రాణీగారు కూడానా?"

"ఆఁ" అని తలవూపా; లేకపోతే నేను చెప్పినదాన్ని నేనే ఖండించుకోవాలి.

"తరువాత చెప్పు మామా!"

"అప్పుడు...శ్యామల ఆడుకుంటూ ఆ తోటలో మల్లెపొద నీడన నిద్రపోతూవున్న ఒక బ్రాహ్మణ యువకుణ్ని చూచింది. వాడు చాలా అందంగా వున్నాడు. వాణ్నిచూసి – రాజుకూతురు – వాణ్ని ప్రేమించింది...."

"అంటే?"

"అంటే నా నెత్తి...నా బుర్ర....నేను దీనికి సమాధానం చెప్పలేను.... సరికదా, నా తాత...ముత్తాత, వాళ్ళూ చెప్పలేరు. ఆ బ్రహ్మ దేవుడు కూడా చెప్పలేడు. అసలు నేనింక యీ కథను చెప్పను." సమాధానం చెప్పటం చేతకాని రోషంతో నాముఖం ఎర్రపడ్డది.

మణి విజయసూచికంగా నవ్వుతూ "పోనీలే మామా! కథ కానీ..." అంది.

మళ్ళీ కొంచెం ప్రోత్సాహం - చెప్పకపోతే వదలదు...చెప్తే నాకు పడే ప్రశ్న పరంపరల ధాకకు ఓర్చుకోనూ లేను, చెప్పనా వొద్దా అని ఆలోచిస్తున్నా.

"మామా! సగం కథ చెప్పి వదిలేస్తే ఒంటిపూస తేలు కుడుతుంది." నాకు జరగబొయ్యే శిక్షను అప్పుడే మణి చెప్పేస్తోంది. నాకు నవ్వొచ్చింది.

"చెప్తాలే, విను. అల్లా రాణికూతురు ప్రేమించింది. కాని ఆ కుర్రవాడు నిద్రపోతూండడంవల్ల ఆమెను చూడలేదు. చెలికత్తెలు ఇది కనిపెట్టి వెళ్ళి రాణిగారితో చెప్పారు. రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా? వెంటనే ఆ కుర్రవాణ్ణి పట్టుకురమ్మన్నాడు. సేవకులు వెళ్ళి, భయంతో వొణికిపోతూన్న ఆ యువకుణ్ణి పట్టుకు వొచ్చారు. వాడి అందాన్ని చూచి రాజు 'వీడే నాకు తగిన అల్లుడ'ని సంతోషించి వాడికి వెంటనే తనకూతుర్నిచ్చి పెళ్ళిచేసి, 'నా రాజ్యాన్ని పాలిస్తూ ఇక్కడే వుండమని' అన్నాడు. అందుకు ఆ యువకుడు వొప్పుకొని, అక్కడ సుఖంగా వుంటూవున్నాడు..." ఇంత గద్యం మణికి అడ్డు ప్రశ్న పడకుండా చెప్పగలిగాననే ధీమా వుంది; కాని కథను ఇక్కడితో ఆపనా, ముందుకు పోనీనా అని ఆలోచిస్తున్నా.

"మామా! కథ అయిందా?"

మణికి నా కథ అవటం తెలియటమా? ప్రత్యేకం మణిని మోసం చేద్దామని, "లేదు-" అన్నాను.

"అయితే తరువాత ఏమైంది?"

"ఏమైందంటే...ఆ కుర్రవాడు ఒకనాడు ఇందాకటి తోటలో షికారుకువెళ్ళి అటూఇటూ తిరుగుతూవుండగా అతని కాలు పొరపాటున ఒక పాముమీద పడ్డది."

"పామే!" మణి ముఖంలో భయమూ, ఆశ్చర్యమూ కలిగాయి. ఇప్పటికి నా కథతో ఆమెలో ఒక 'ఫీలింగ్'ను తెప్పించగలిగానని గర్వించా.

"ఆఁ...పామే! తాచుపాము... వెంటనే పాము బుస్సు మని లేచి, యువకుణ్ణి కరిచింది. వెంటనే వాడు ప్రాణం వొదిలి చచ్చాడు" ప్రాణం వదలకుండా చావలేడని నాకు తెలిసినా - మణికి తెలిసేందుకు, ద్రాక్షాపాకంగా కథను తయారుచేస్తున్నా.

"తరువాత?"

తరువాత ఏం చెప్పను? కొంచెం ఆలోచించి, అప్పుడు రాజుగారి కూతురు...మొగుడు చచ్చినందుకు భోరు భోరున ఏడ్చి, మొగుడితోపాటే చచ్చిపోవాలని నిశ్చయించుకొంది. ఆమె ఇట్లా ఏడుస్తూ మొగుడిశవం దగ్గర కూర్చొని వుండగా - ఆమెకు సమీపంలో వున్న వేపచెట్టు మీద ఒక మగపక్షి ఒక ఆడపక్షి చేరి

మాట్లాడుకొంటున్నాయి. గొప్ప చదువు చదువుకొన్న రాజుగారి కూతురుకు పక్షులభాష తెలుసు. అందుకని ఆమె ఏడవడం కొంచెం ఆపి, ఆ పక్షులు ఏం మాట్లాడు కుంటున్నాయోనని వింది. ఆడపక్షి 'ఇప్పుడు ఆ బ్రాహ్మణ కుర్రవాడు బతికే ఉపాయం ఏమన్నావుందా?' అని అడిగింది. దానికి మొగపక్షి, 'లేకేం? ఈ తోటలో దక్షిణపు మూలవున్న వేపచెట్టు మొదట్లో వొక వేరువుంది. ఆ వేరుతో గంధంతీసి అది ఆ కుర్రవాడి కళ్ళల్లో పెడితే బతుకుతాడు' అని చెప్పింది."

మణి అందుకొని, "మామా! పక్షులు మాట్లాడతయ్యా?" అంది. ఈ విషయం మణికి ఎంత తెలుసో, నాకూ అంతే తెలుసు. కాని ఇల్లాటి ఘట్టాల్ని నేను ఒకప్పుడు 'కాశీ మజిలీల్లో' చదివినట్టు గుర్తు. జంగిల్ పిక్చరులాగు స్టంట్లతో నిండిన ఆ గ్రంథ రాజాన్ని 'అథారిటీ' కింద మణికి ఎల్లా చూపను?

"ఎందుకు మాట్లాడవూ?" అని ఎదురు ప్రశ్న వేశా. మణికి బహుశా యీ విషయం తెలియదు; అందులో మామ గారి అనుభవాన్ని నెట్టివెయ్యకుండా – ఆమె కనీసం నమ్మినట్టు నటించి వూరుకొంది.

నేను కథను అందుకొన్నా – "అప్పుడు రాజుకూతురు సంతోషించి, ఆ వేరుతెచ్చి, ఆ గంధాన్ని మొగుడికళ్ళల్లో పెట్టింది."

"చచ్చినవాళ్ళు కళ్ళు తెరుస్తారా?"

"వాడు తెరవలా. ఆమే భర్తకళ్ళను తెరచిపెట్టింది. అప్పుడు వాడు నిద్రనుంచి లేచిన వాడిలాగు లేచికూర్చున్నాడు."

మణి పకపకా నవ్వుతూ అంది: "మామా! భలే! చచ్చినవాళ్ళు బతుకుతారా? మా మామ్మ చచ్చిపోయింది. ఆమె మళ్ళీ బతకలేదు. నా జానీ కుక్క చచ్చిపోయింది. చచ్చాక మళ్ళీ బతకలేదు. మామా! చచ్చినవాళ్ళు బతకంగా ఎప్పుడన్నా చూశావూ?"

నేను నిలువునా నీరైపోయా. ఆమె వేళాకోళంతో నాకు కంపరమెత్తింది. కాని ఆమె మాటలకు నాకుకూడా నవ్వొచ్చినా అతి కష్టంమీద ఆపుకున్నా. చచ్చినవాళ్ళు బతుకుతారా? నా తెలివి తెల్లవారుతే, ఇదేంకథ? అయినా యీరకం కథల్లో ఎందుకు బతకరు? సావిత్రి ఫిల్ములో చచ్చిన సత్యవంతుడు బతకలా?

"ఆ వేరుకు బతికించే గుణం వుంది" ఓడిపొయ్యే కేసును ఎల్లాగైనా గెలిపించేందుకు తంటాలుపడే ప్లీడరు అవస్థ నాకు పట్టింది.

"అల్లాంటి వేరువుంటే – లోకంలో చచ్చిన వాళ్ళందరూ బతకరూ?"

"నిజమే కాని – ఇప్పుడు అది దొరకదు."

"పోనీ – చివరకు ఏమైంది?"

"ఏమైంది?...రాజు కూతురు, ఆ యువకుడూ సుఖంగా వున్నారు. కథ కంచికీ, మనం ఇంటికీ..." చివరవుండే ట్రేడ్ మార్కుతో సహా కథ ముగించాననే ధీమా కలిగింది.

మణి గంభీరంగా నవ్వి, "మామా! నువ్వు రాసే కథల్ని అందరూ చదువుతారా?" అంది.

"ఎందుకు చదవరూ? చాలా బాగున్నాయంటారు."

"మామా! నువ్వు ఎన్ని కథలు రాశావు?"

"అబ్బో! చాలారాశా...రాసీ....రాసీ కలం పాళీ ఎల్లా అరిగిపోయిందో చూడు" అని జేబులోని కలాన్ని తీసి కోర్టులో సాక్షిని నిలబెట్టినట్టు నిలబెట్టా.

"ఇల్లాటి కథల్ని నాకు చెప్తే చెప్పావు కాని - ఇంకెవ్వరికీ చెప్పవోక -" మణి జాలిగా, సానుభూతిగా చెప్పింది.

"ఏం?"

"ఇదేంకథ? చచ్చినవాళ్లు బతకుతారు; పక్షులు మాట్లాడుతాయి. ఏ పక్షీ నాతో మాట్లాడలేదే! ఛీ.....ఇల్లాటి కథల్ని రాస్తే...చదివేవాళ్ళు...వాళ్ళ కేం తెలీదు....నా దగ్గరికి వస్తే చెప్పేదాన్ని..."

నన్నుచూచి మణి కడుపు చెక్కలయ్యేట్టు పకపకా నవ్వటం మొదలెట్టింది. ఇంత ఆలోచించి, ఇంత శ్రమపడి జంతు శాస్త్రాన్నీ, వృక్షశాస్త్రాన్నీ టెక్కునిక్కునూ, స్టంట్లనూ, చౌచౌగా చేసి చెప్పిన కథకు ఇదేనా..ప్రతిఫలం...?

- ఫిబ్రవరి, *1940*